**వర్షం బాగా పడుతున్నది. సాయంత్రం అయిదు గంటలేఅయినా టైమ్ ఏ ఏడుగంటలయిందో అనిపించేలా ఉన్నది. వర్షం అంతకంతకు హెచ్చే జాడలేకాని తగ్గేసూచనలేవీ కనిపించటంలేదు.**

అప్పటికే సుమారుగా రెండున్నర గంటల నుంచి బస్ కోసం ఎదురు చూస్తూ కూర్చున్నారెందరో ప్రయాణీకులు. అదొక చిన్న పల్లెటూరు. కనీసం ఒక బస్ షెల్టరయినా లేదు. అక్కడే ఉన్న ఆ చిన్న పాకలో దాదాపు ఓ ఇరవై అయిదు మంది ప్రయాణీకులు పడిగాపులు కాస్తున్నారు.

వాళ్ళలో పార్వతి, ఆమె భర్త సుబ్బారావు కూడ వున్నారు. వారు బస్ కోసం ఎదురు చూచి చూచి విసిగి వేసారి పోయినట్లు వారి ముఖాలను చూడగానే ఎవరైనా చెప్పవచ్చు. పార్వతి గట్టి మనిషి కూడ కాదు. ఐదు నెలల గర్భిణి. మనిషి చాల నీరసంగా ఉన్నట్లున్నది ఆమె అలా ఎప్పటి నుంచో నిలబడి ఉన్నది. సుబ్బారావు మాత్రం అక్కడ ఉన్న ఒకే ఒక బెంచీ మీద మిగిలిన ప్రయాణీకులతో కూర్చుని ఉన్నాడు. అతనికి తన భార్య పార్వతి లేవలేని మనిషని ఆమెను కూర్చో బెట్టాలన్న స్పృహ కూడ లేదు. తనేమిటో తనగొడవ ఏమిటో. చాల మంది మగవాళ్ళు అంతే. ప్రయాణంలో ముందుతమసౌఖ్యమే చూచుకుంటారు.

పార్వతికి కాళ్ళు విపరీతంగా పీకుతున్నాయి. కండ్లు తిరుగుతున్నాయి. అయినా సుబ్బారావు ఆమెకేసి చూడటం లేదు. పార్వతి గర్భిణితో ఉన్నదని ఆమె తల్లిదండ్రులు పుట్టింటికి తీసుకువచ్చారు. కాని సుబ్బారావు కొన్నాళ్ళుపార్వతిఇంట్లో లేకపోతే ఎలా ఉంటుందో. ఎంత పని తన తల్లి నెత్తిన పడిందో అర్థంచేసుకొని పార్వతిని పుట్టింటినింటి నుంచి తీసుకువెళ్ళటానికి వచ్చాడు. పార్వతి తల్లిదండ్రులకు అతను అర్థాంతరంగ అలా పిల్లని తీసుకు వెళ్ళటం ఇష్టంలేకపోయింది. అందునా వర్షంలో- సాయంత్రం పూట. ఆ టైమ్‌కి వున్నది ఒకే ఒక బస్సు. పైగా ఊరుపెద్దది కావటం వల్ల సినిమాలకని, సరుకులకని వచ్చే జనం తిరిగి ఇండ్లకు వెళ్ళటానిక్కి ఆ బస్సే ఎక్కుతారు పార్వతి వాళ్ళ ఊరు వచ్చే సరికే ఆ బస్సు నిండిపోయి నిండు గర్భిణీలా నడవటం-ఆగటంగా వస్తుంది. ఎవరెంత చెప్పిన సుబ్బారావు వినలేదు. "లేదండీ! ఇవాళే. ఈ బస్సుకే తీసుకు వెళ్ళాలి" అన్నాడు ఖచ్చితంగ.

పార్వతి తల్లి దండ్రు లింక ఏమనలేక పోయారు. దానికీ కారణం వున్నది. పార్వతికి సుబ్బారావుతో పెండ్లయి మూడేండ్లు అయినా కడుపు కాలేదని అత్త ఆడబిడ్డలు చిందులు తొక్కారు. గొడ్రాలు అన్నారు. "మా వాడికింకో పెండ్లి చేస్తే బాగుండు"నన్నారు ఈ అన్ని విషయాలు విన్న పార్వతి తల్లిదండ్రులు నిజంగా అన్నంత పనీ చేస్తారేమోనని భయపడ్డారు. పార్వతి తండ్రికి ఇటీవలి పేపర్లలో వార్తలు మరీ భయమనిపించసాగాయి. అందుకే సుబ్బారావు తీసుకువెళ్తానంటే "అతను అదిడ్ని వదలి ఉండలేకపోతున్నాడేమో పంపండి" అని తెలిసిన నలుగురూ అంటుంటే పంపారు.

మరి కొంతసేపటికి అందరూ ఎదురు చూస్తున్న బస్ రానే వచ్చింది. అప్పటికే నిల్చున్న ప్రయాణీకులున్నారు. బస్ వచ్చీ రాగానే ఆగీ ఆగగానే జనమంతా ఒకేసారి తోసుకో సాగారు. పార్వతికి ఆ పరిస్థితి చూస్తుంటే ఎక్కలేం అనిపించింది. సుబ్బారావ్ పార్వతి ఎక్కుతుందో లేదో చూచుకోకుండానే తోసుకొని ఎక్కే ప్రయత్నంలో వున్నాడు. పార్వతి ఎలాగో ధైర్యంగా "ఏమండీ" అన్నది.

ఏమిటన్నట్లు వెనక్కు తిరిగి చూశాడు

"నిలబడలేను. ఇంటికి వెళ్దాం. రేపు పొద్దుట బస్సుకే వెళ్ళవచ్చు"—ఆమె అర్థిస్తున్న రీతిలో అడిగింది.

"నోరు మూసుకొని ఎక్కు" ఉరిమాడు సుబ్బారావు. కండక్టరు అది చివరి బస్సు కావటాన అందరికి టిక్కట్లు ఇస్తున్నాడు. కాదనకండా. టిక్కట్లు తీసుకున్నవారు ఒక్క అడుగు కూడ ముందుకు వేయకుండా అక్కడికక్కడే నిలబడిపోతున్నారు. కండక్టరు సర్దే ప్రయత్నం ఏమీ చేయటం లేదు. ప్రయాణీకులు అలాగేవుండిపోయారు.

సుబ్బారావు టిక్కెట్లు తీసుకున్నాడు. ఒకసారి పార్వతివైపు చూశాడు అంతే.

మాటకారియైన సుబ్బారావు చొరవగా ఒక సీటు దగ్గరకు వెళ్ళి అరటిక్కెట్టు పిల్లడ్ని వడిలో కూర్చోబెట్టుకొని అక్కడ చోటుచేసుకొని కూర్చున్నాడు.

పదవక్లాసు వరకు చదువుకొన్నపార్వతికి కొన్ని రూల్సు తెలుసు. స్త్రీలకు కేటాయించబడిన సీట్లలో కూడ మగవాళ్ళే కూర్చున్నారు. కేవలం మూడు సీట్లలోనే ఆడవాళ్ళు కూర్చున్నారు. అందులో ఒక సీట్లో కిటికీ ప్రక్కనే ఒక యువకుడు అతని ప్రక్క అతని భార్య కామోసు ఓ స్త్రీ కూర్చుని వున్నది. ఆవిడ ప్రక్కనే మరో ఆవిడ కూర్చున్నది. ఆ భార్యా భర్తలకి ఇంటి వద్ద ప్రేమించుకునేందుకు ఖాళీ లేదేమో బస్‌లో ప్రేమాయణం మొదలెట్టారు. ఆ అమ్మాయి అతడి భుజం మీద పడుకున్నది. అతను ఆ అమ్మాయి చెవిలో గుస గుస లాడటం. ఆవిడ నవ్వటం. పార్వతి మరో రెండు



సీట్ల కేసి చూసింది. ఒక దాన్లో పాపం ఎవరో సహృదయులైన ఆడవారు జరిగి నాలుగో ఆవిడకు చోటిచ్చారు. ఫ్రంట్ సీట్లో ఉన్న వాళ్ళనెలాగో అడిగింది పార్వతి. "ఏమండీ కొంచెం సర్దుకోరూ" ఆమె కండ్లల్లో నీళ్ల నిండుకొస్తున్నాయి.

ఆ సీట్లో ఇద్దరుఅమ్మాయిలు స్టూడెంట్లు. వాళ్ళేదో తీవ్రంగా చర్చించుకుంటున్నారు ఆ రోజే విడుదలైన సినిమా గురించి. మరో స్త్రీ విశ్రాంతిగా ఒరిగి కూర్చున్నది- ఎక్కడ సీట్ ఇవ్వవలసి వస్తుందోనని.

"ఇది ముగ్గురు కూర్చునే సీటే" అన్నది పైగా.

"తెలుసు తల్లీ ! జాలి దయ అలాటివి ఉంటే ఇవ్వవచ్చునని" అనుకున్నది పార్వతి మనసులో. ఇక తమ ఊరికి వెళ్ళే వరకు సీటు దొరకదు. అని పైన రాడ్ని పట్టుకున్నది. కండక్టర్ టికెట్టు ఇవ్వడంతో తన డ్యూటీ అయిందనుకున్నాడు. కనీసం "పైకి జరిగి సర్దుకొని నుంచోండి అని అయినా అనలేదు.

మన దేశంలోని రోడ్లు వాటి స్థితిగతులు అందరికీ తెలిసినవే కదా! ఒక్కొక్క కుదుపుకి పార్వతికి కడుపంతా కదిలినట్లవుతున్నది. అప్రయత్నంగా తన ముందున్న స్త్రీ వైపు చూసింది. పాపం ఆ స్త్రీ చేతిలో ఆర్నెల్ల పసికందున్నది. ఆతల్లి భయంతో బిక్క చచ్చిపోతున్నది పడిపోతానేమోనని జారిపోయే పిల్లాడ్ని ఒక చేత్తోనే చంకలో నుంచి జారకుండ ఎత్తుకున్నది. ఈ గందరగోళంలో ఆవిడ పైట జారింది. పాలతో నిండుగ వున్న స్తనాలు, జాకెట్టుకు లొంగక కొద్దిగ బయటకు కనబడుతున్నాయి. స్టూడెంటమ్మాయిలు ఆ దృశ్యం చూచి పడి పడి నవ్వుతున్నారు. అదేదో విచిత్రమైనట్లు మళ్ళీ మళ్ళీ చూసి మరీ ఆనందపడిపోతున్నారు.

పార్వతికి చాలా జాలి వేసింది. ఆ స్త్రీ అవస్థ చూస్తుంటే.

"ఎక్కడ్నించి వస్తున్నావమ్మా" అన్నది ఆవిడ పైటని సరిచేస్తూ.

"చంటోడికి ఒంట్లో బాగులేదు తల్లీ! ఆసుపత్రికి తీసుకొచ్చినా. ఈ ఊర్లో మా తాత ఉంటే చూద్దామని పట్నం నుంచి ఈడ దిగా. బస్సు ఇప్పటికి దొరికినాది."

చంటోడికి బాగోలేదని విన్నాకూడ సీట్లలోని అమ్మాయిలుకాని. ఈవైపు సీట్లలో అబ్బాయిలు కాని ఎవరూ లేచి ఈవిడ్ని కూచోమనలేదు.

బస్సు మరో ఊర్లో ఆగింది. ఆబోతు లాంటి మనిషి బస్సెక్కాడు. కండక్టర్ చప్పున లేచి నిలుచుని "కూర్చోండి" అన్నాడు తన సీట్ చూపించి. ఆ వెనుక సీట్లో మరో ఒకడు లేచి నిలబడి "మీరిక్కడకు వచ్చి కూచోండి సుబ్బయ్యగారు" అని ఆ ఆబోతు లాటి వాడితో వచ్చిన చిన్న ఆబోతుని పిలిచాడు. పార్వతి ఆ ప్రక్క వారి మాటలవల్ల ఆ బస్సెక్కి

అతను సిగరెట్ కాలుస్తున్నాడు. బాగా విశాలంగా కూర్చున్నాడు. అతని ప్రక్కన కూర్చున్నతను బాగా ముసలివాడు. సుబ్బారావుకి భార్య వట్ల ఏ మాత్రం ప్రేమాభిమానాలున్నా తాను లేచి అక్కడ ఆవిడ్ని కూర్చోమనాలి.




నతను ఆ ప్రాంతపు ఎం.ఎల్.ఏ.గారి బావమరిది అని తెలుసుకున్నది. 'అధికారం-హోదా వీటి ముందు మానవత్వం తల వంచవలసిందేనా?' అని మనసులో ప్రశ్నించుకొని తన భర్తవైపు చూచింది.

కాని సుబ్బారావు ఆడదాన్ని మనిషిగా గుర్తించని మగవాళ్ళ జాబితాలోకి వస్తాడు. కాబట్టి ఇక్కడ ఆ ఆశకు చోటు లేదు.

కాని సుబ్బారావు కూర్చున్న ముందు సీట్లో అతను తన సీటు భార్యకు ఇచ్చి

కూర్చోబెట్టి తాను నిలబడ్డాడు. పైగా పరాయి మగవాడి పక్కన కూర్చున్నందుకు సంకోచ పడుతున్న ఆమెతో మధ్య మధ్యలో అతను "శారదా సరిగ్గా కూర్చో. పడిపోతావ్" అని ఆప్యాయంగా హెచ్చరిస్తున్నాడు. అది చూచిన పార్వతి 'పూజకొద్దీ పురుషుడు' అని తప్ప మరేం అనుకోలేకపోయింది.

మరో ఊర్లో బస్ ఆగింది. దిగినవారు దిగుతున్నారు దిగేవాళ్ళు దిగకముందే ఎక్కే వారు బస్ ఎక్కటానికి ఆరాటపడుతున్నారు. అదొక చిన్న సైజు రణరంగమయింది. ఇపుడు కూడ పార్వతికి కూర్చోటానికి అవకాశం దొరకలేదు. బస్ బయలుదేరింది. రివ్వుమని గాలి వీచింది. నిలబడేందుకు ఆసరా కోసం పార్వతి రాడ్ పట్టుకున్నది. పైట గట్టిగా బిగించి లేకపోవటంతో. సిల్కుచీరె కావటాన జారింది గబుక్కున పార్వతికి. ఇది సుబ్బారావ్ చూస్తే తనను చంపేస్తాడని గుర్తు వచ్చి పైట ఓ చేత్తో సేసుకున్నది. మరో చేత్తో నడుం చుట్టు బిగించింది. ఆ తొందర పాటులో రెండు చేతులూ రాడ్‌ని వదలడం. అపుడే బస్‌కి సడన్ బ్రేక్ వేయడం పార్వతి ముందుకి తూలి పడటం అన్నీ నిముషంలో జరిగాయ్. "అయ్యో అయ్యో" అన్నారు అంతా. సుబ్బారావ్ లేచి వచ్చాడు విసురుగా. జబ్బ పట్టుకొని పైకి లేపుతూ. "పైట జారిన సంగతి కూడ తెలినంత మత్తులో ఉన్నావా. లేకుంటే నీ పొంగు చూడమని ప్రదర్శనా?" అని చెవిలో పోరాడాడు.

తాను పడగానే "దెబ్బ తగిలిందా" అని అడగవలసిన మగడు అడిగిన ఈ ప్రశ్నలతో పార్వతికి తల తిరిగినట్లంది "దెబ్బ తగిలిందామ్మా" అన్నది ఒక్క డ్రైవర్ మాత్రమే. "లేదు" అన్నది పార్వతి. లేచి సరిగా నిలబడింది. కూర్చున్న స్త్రీలు తాము లేవవలసి వస్తుందన్న భయంతో "తూలి పడింది లెండి, దెబ్బ తగల్లేదు" అన్నారు. ఆహా. స్వార్ధమా ఏమి నీ శక్తి! సుబ్బారావు యధాప్రకారం సీటు ఆక్రమించాడు ఆ పక్క స్టేజిలోనే బస్ ఆగటం జనమంతా దిగటం జరిగింది. పార్వతి ఆ చీకట్లో సుబ్బారావు వెంటనే నడుస్తున్నది. సుబ్బారావ్ ఇంటికి వెళ్ళినంతసేపు తిడుతూనే ఉన్నాడు. వచ్చీ రాని ఇంగ్లీషులో. "రాస్కెల్ పొగరు. స్టయిలుగా నిలబడింది. పైట జార్చి ఎగ్జిబిషన్ పెట్టింది. కూర్చుంటే కనబడదుగా బస్‌లోని ఎదవలందరికి. అందుకని నిలబడి నాటకం ఆడింది"

పార్వతి ఆ మాటలు విన్నా వినబడనట్లే నడుస్తున్నది. అతనితో వాదించి లాభం లేదని తెలుసు. కాని అదే సమయంలో ఆమె ఆలోచిస్తున్నది— తెలీని ఎన్నో విషయాల గురించి. "మన ఆంధ్ర దేశంలో మా ఊరి బస్సేనా ఇలా ఉండేది? మిగతా ఊళ్ళలో స్థితి కూడా ఇంతేనా? మన రాష్ట్రంలో నేనా స్త్రీలు-అనారోగ్యంతో బాధపడుతున్న ఆడవాళ్ళు పిల్లల్ని ఎత్తుకుని నిలబడి వున్నా దర్జాగా ఆరోగ్యంగావున్నా యువకులైన మగవాళ్ళు కూర్చునేది? నా భర్తేనా భార్యని ఇలా చూసేది?" మిగతా అన్నింటికి సమాధానం తెలీకపోయినా చిట్టచివరి ప్రశ్నకు మాత్రం జవాబు తెలుసు పార్వతికి.

"నడు గబగబ ఎదవ స్టైలు. "నడె హే" గేదె నదిలించేటపుడు. ఎడ్ల బండిని తోలేటప్పుడు భర్త అలా అనటం పార్వతికి తెలిసిన విషయమే.

"నడే హే. దీని సిగ దరగ."

అంటే తాను ఆ పశువులకంటె అతని దృష్టిలో ఎక్కువ కాదన్న మాట!

ఇంటికి సమీపించారు. సుబ్బారావు తల్లి ఆదరంగానే ఆహ్వానించింది.

భోజనాలయిన తర్వాత పడుకోబోయే ముందు టైము చూసింది పార్వతి. పదకొండు గంటలయింది. సుబ్బారావు అలిగి పార్వతితో పలక్కుండా పడుకున్నాడు. అయినా పార్వతి తనకేం భయం లేదన్నట్లు తనకో తోడు రాబోతున్నట్లు పొట్ట మీద ప్రేమగా చెయ్యివేసి నిమురుకున్నది. అలాగే తృప్తిగా నిద్రపోయింది.

రెండు గంటలవుతున్నది. చుట్టూ చీకటి పార్వతికి భరించలేని కడుపు నొప్పి. భరించలేక "అమ్మా" అని ఏడుస్తున్నది. కడుపులో ఏదో కదులుతున్నది. "ఏవిటీ" సుబ్బారావు నిర్దయపూరితమైన ప్రశ్న.

"ఇందాక బస్‌లో పడినపుడు పొట్టలో ఏదో దెబ్బ తగిలినట్లనిపించింది. ఇప్పుడు బాగా నొప్పి".

తెల్లవారేలోగా — పార్వతి ఏ తోడును చూసుకొని తృప్తిగా బతకాలనుకున్నదో ఆ తోడు. ఆ అసంపూర్ణ ఆకారం. రక్తపు ముద్దలా దర్శనమిచ్చింది. మంచం మీద పడుకున్న పార్వతి నిర్లిప్తంగా పైకి చూస్తున్నది. అత్త గొంతు వినపడుతున్నది "దరిద్రపుది. రాకరాక వచ్చిన కడుపు నిలవలేదు. పాడు మొహంది" అంటోంది.

"చంద్రకళా! మనం హనీమూన్‌కి డార్జిలింగ్ వెళ్దామా? పోనీ ఇంకెక్కడికయినా వెళ్దామంటే చెప్పు. నీ యిష్టం! నువ్వెక్కడికి వెళ్దామంటే అక్కడికి వెళ్దాం."
అడిగాడు రావ్ ఫోన్‌లో.
"బెంగుళూరు చూడాలని వుంది" అంది చంద్రకళ అతని ఊహల్లో తనూ తేలిపోతూ.
"వెరీగుడ్! అయితే మరి మన పెళ్ళికి నువ్వు వప్పుకున్నట్లే కదూ?"
చంద్రకళ ఉలిక్కిపడి ఈ లోకంలోకొచ్చింది.
"యూ ఆర్ మాడ్! మన పెళ్ళి జరగదు"
అంటూ ఫోన్ పెట్టేసింది.
జ్యోతి
మాసపత్రిక మార్చి సంచికలో
ప్రారంభమవుతూన్న
"రైల్వే జంక్షన్"
సస్పెన్స్ థ్రిల్లర్ చదవండి!